క్లుప్తంగా

మంత్రిని కలిసిన ఎంపీపీ



మంత్రిని కలిసిన ఎంపీపీ, పార్టీ నాయకులు

పెద్దపంజాణి: రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని పెద్దపంజాణి ఎంపీపీ ఎన్. రెడ్డెప్ప ఆదివారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను మంత్రికి వివరించినట్లు చెప్పారు. ఆయనతో పాటు సింగిల్‌విండో మాజీ చైర్మన్ శంకరప్ప, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు రాజారెడ్డి ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద అభివృద్ధి పనులను బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి పరిశీలించారు. ఆదివారం గంగాపురంలో ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ పనులను పరిశీలించి మాట్లాడారు. పనుల్లో నాణ్యతాప్రమాణాలను పాటించి నిర్ణీత గడువులోపు పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే బోయకొండలో కోట్లాది రూపాయలతో చేస్తున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. దర్శనం, మౌలిక వసతులపై భక్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు రాజేష్, భారతి, వైఎస్సార్ సీపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో కార్తీక మాస ధాత్రి హోమాలు

పుంగనూరు: పట్టణంలోని శ్రీహరిహర బ్రాహ్మణ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక మాస ధాత్రి హోమాలు చేశారు. శంకరాచార్యులు పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రాజశేఖర్ దీక్షితులు, రాజేష్, రామమూర్తి, మధు, రామచంద్రరావు, ఉదయ్‌కుమార్, సుబ్రమణ్యం, బ్రాహ్మణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

చౌడేపల్లె: శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్రమం నిర్వహణకు బెంగళూరు ఎమ్మెల్సీ రామోజీ గౌడ రూ.25వేల విరాళాన్ని ఈఓ చంద్రమౌళికి అందజేశారు. తమ కోర్కెలు ఫలించడంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించినట్టు చెప్పారు. దాత కుటుంబ సభ్యులను ఈఓ సత్కరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెద్దపంజాణి: మండలంలోని శివాడి గ్రామంలో ఆదివారం 70 (90 ఎంఎల్) కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం.. శివాడికి చెందిన క్రిష్ణారెడ్డి కుమారుడు భాస్కర్ రెడ్డి కర్ణాటక మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం అందడంతో సిబ్బందితో కలసి గ్రామంలోని అతని ఇంటి పరిసరాల్లో దాడులు చేశారు.కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

శాస్త్రోక్తంగా రుద్రయాగం



కొలువైన శ్రీకామాక్షి దేవి సమేత శ్రీకపిలేశ్వరస్వామి ఉత్సవమూర్తులు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో మూడో రోజైన ఆదివారం రుద్రయాగం శాస్త్రోక్తంగా చేపట్టారు. హోమంలో పాల్గొన్న భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి

చిత్తూరు కార్పొరేషన్: బీజేపీతోనే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పీఎం నరేంద్రమోదీ నాయకత్వంలో అభివృద్ధి ఉంటుందని ప్రజలు నమ్మి ఓట్లు వేశారన్నారు.

ఈరోజు

మండల సమావేశం

పుంగనూరు: మండల సాధారణ సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నారాయణ ఆదివారం తెలిపారు. సమావేశానికి సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

దివ్యాంగ పిల్లలకు వీల్ చైర్లు పంపిణీ



దివ్యాంగ పిల్లలకు వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు పంపిణీ చేసిన దాతలు, విద్యాశాఖ సిబ్బంది

గంగవరం: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఆదివారం స్థానిక స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మండల విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భవిత కేంద్రం వద్ద జాయినింగ్ ద డాట్స్ ఫౌండర్ ధనరాజ్ సహకారంతో దాతలు జీరోధ కంపెనీ ప్రతినిధులు దివ్యాంగ పిల్లల కోసం రూ.లక్షన్నర విలువ చేసే వీల్ చైర్లు, క్రీడా వస్తువులు, ఉయ్యాలలు, వాకర్లు మొదలైన వాటిని వితరణ చేశారు. వాటిని మండల విద్యాశాఖాధికారులు, ఐఈఆర్‌టీ టీచర్లు పంపిణీ చేశారు. వారు మేనరిక వివాహాలు, చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం వలన వైకల్యం, మానసిక సమస్యలతో పిల్లలు జనిస్తారని, ఇలా జన్మించిన పిల్లలను పెంపకంలో మరింత శ్రద్ధ, ప్రేమానురాగాలు చూపవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఒకవేళ పోషణ భారమైతే సమీపంలోని భవిత కేంద్రాల్లో అలాంటి పిల్లలను చేర్పించాలని, వారి బాగోగులను చూసుకునేందుకు ప్రభుత్వం సౌకర్యాలు సమకూర్చిందన్నారు. భవిత కేంద్రంలోని దివ్యాంగ పిల్లల్లో నైపుణ్యాలను, ప్రతిభను వెలికితీయడానికి కృషి చేస్తామని సాహితీ ఉపాధ్యాయురాలు సురేఖ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు రూప, దేవేంద్ర, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు త్రిలోక్, అశోక్ కుమార్, సీఆర్‌పీలు రాజన్న, గాయత్రి, జేటీడీ వలంటీర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు పట్టణంలోని విద్యాశాఖ కార్యాలయం భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. జెటిడి సంస్థ సహకారంతో జెరోధ కంపెనీ వారు రూ. 2. 70 లక్షలతో ఉచితంగా అందించిన పరికరాలను ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం కలిసి స్వీకరించారు. ఐఈఆర్‌పి ఉపాధ్యాయులు మంగేశ్వరి 20మంది పిల్లలకు దుస్తులను ఉచితంగా అందించారు.



వి.కోటలో..

ప్రత్యేక ప్రతిభావంతులకు గౌరవప్రద జీవితం

వి.కోట: ప్రత్యేక ప్రతిభావంతులపై వివక్ష చూపకుండా వారు కూడా సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా చూడాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాలగురునాథ్ అన్నారు. ఆదివారం వి.కోటలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు మండల వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కేక్ కట్ చేసి పంచారు. అలాగే అన్నదానం చేశారు. తమకు మద్దతిచ్చిన పట్టణ ప్రముఖులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శంకర్‌రావ్, నాగరాజు, వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్‌ఖాన్, నాయకులు రామకృష్ణ, వేణాచ్చారి, గోపినాథ్, తిప్పరత్నాచారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో ‘క్రిస్‌మస్ ఈవ్’



క్రిస్‌మస్ ఈవ్ నిర్వహిస్తున్న పాస్టర్, చర్చి సభ్యులు

పుంగనూరు: పట్టణంలోని ధోబీ కాలనీలోని తెలుగుతల్లి వృద్ధాశ్రమంలో ఆదివారం క్రిస్‌మస్ ఈవ్ సంబరాలు నిర్వహించారు. పాస్టర్ రాకేష్ నిమ్రోద్, కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో వృద్ధులతో కలసి కేక్ కట్ చేశారు. కీర్తనలు ఆలపించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సురేష్ క్రిస్టఫర్, దేవప్రకాష్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మనువాదంతో పోరాటమే పంచుకుందాం..రా



సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ రచయిత్రి జూపాక సుభద్ర

గంగవరం: పలమనేరు మండలంలోని కళామందిరంలో పానుగోటి కృపాకర్ కవితా సంపుటి పంచుకుందాం రా.. పరిచయ వేదిక ఆదివారం కార్యక్రమానికి ప్రసిద్ధ సాహితీవేత్తలు జూపాక సుభద్ర, కవితశ్రీ, కుమారస్వామిరెడ్డి, సిద్ధార్థ, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, బాబ్జి, గంటామోహన్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు, యుగంధర్, గిరిధరమూర్తి, శ్రీనివాస తదితరులు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రసంగించారు. మనువాదంతో పోరాటమే ‘పంచుకుందాం రా’ అని పేర్కొన్నారు. వర్తమాన తెలుగు కవిత్వంలో కొత్త ఒరవడి కృపాకర్ కవితా సంపుటి అని, బహుజన సాహిత్యానికి ఒక మేలిమ కూర్పు అని వ్యాఖ్యానించారు. అద్భుతమైన కవిత్వాన్ని కృపాకర్ అందించారని అభినందించారు. అనంతరం కవి పానుగోటి కృపాకర్ దంపతుల్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలమనేరు రచయితల సంఘం అధ్యక్షుడు పలమనేరు బాలాజీ, తెలుగు సాహిత్య సమితి అధ్యక్షుడు తులసినాథంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జోతిష్యంతోనే దిశానిర్దేశం

తిరుచానూరు(చంద్రగిరి): పాంచరాత్ర ఆగమంలో తెలియజేసిన జోతిష్య శాస్త్రంతోనే మానవ మనుగడకు దిశా నిర్దేశమని జాతీయ సంస్కృత విద్యాపీఠం ఆచార్యులు చక్రవర్తి రంగనాథన్ తెలియజేశారు. టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు, భగవత్‌శాస్త్ర పాంచరాత్ర ఆగమ సంరక్షణ సభ సంయుక్త ఆధ్వర్యంలో తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం వద్దనున్న ఆస్థాన మండపంలో అఖిల భారత భగవత్‌శాస్త్ర పాంచరాత్ర ఆగమ విద్వత్ సమ్మేళనం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆచార్య రంగనాథన్ మాట్లాడుతూ పాంచరాత్ర ఆగమంలో భరత నాట్యం, సంగీతం, వాయిద్యం, జోతిష్య శాస్త్రాలు ఇమిడి ఉన్నాయని తెలిపారు. శ్రీవామనాచార్యులు, శ్రీభగవద్ రామానుజాచార్యులు, శ్రీవేదాంత దేశికర్ పాంచరాత్ర ఆగమాన్ని రక్షించారని వివరించారు. అనంతరం పాంచరాత్ర ఆగమ శాస్త్ర విశేషాలకు చెందిన ‘శ్రీ భవిష్యకర సంహిత’ గ్రంథాన్ని జాతీయ సంస్కృత విద్యాపీఠం విశ్రాంత ఆచార్యులు ఎల్ఎస్ భట్టర్ ఆవిష్కరించారు. తరువాత తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, మేల్కోటి వేదపాఠశాల, శ్రీరంగం వేద పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు పాంచరాత్ర ఆగమ విశేషాలు వివరించారు. టీటీడీ పాంచరాత్ర ఆగమ సలహాదారులు శ్రీనివాస చార్యులు, ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ శ్రీ పురుషోత్తం పాల్గొన్నారు.

జడివాన- జల దిగ్బంధం



కుమ్మరికండ్రిక పంట పొలాల్లో వర్షపు నీరు

రేణిగుంట: తుపాను ప్రభావంతో ఎడతెరపి లేకుండా జడివాన కురుస్తుండడంతో రేణిగుంట మండలంలో వర్షపు నీరు లోతట్టు ప్రాంతాలకు చేరి జనావాసాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రేణిగుంట పట్టణంలోని బిస్మిల్లానగర్, భగత్‌సింగ్ కాలనీ, రజక కాలనీ, వివేకానంద కాలనీల చుట్టూ వర్షపు నీరు చేరింది. సర్పంచ్ నగేషం జేసీబీ సాయంతో నీటిని వాగు వైపు మళ్లించారు. మండలంలోని గాజులమండ్యం స్వర్ణముఖీ నదిలో రజక కాలనీ తాగునీటి బోరు నీట మునగడంతో సర్పంచ్ గంగారి రమేష్ ఆధ్వర్యంలో మోటారును బయటకు తీసి మరమత్తులు చేపట్టారు. గాజులమండ్యం దేశమ్మనగర్, ఏపీఐఐసీ క్వార్టర్స్‌లో వర్షపు నీరు ఇళ్లలోకి రావడంతో దారిమళ్లించారు. కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో వర్షపు నీరు ఇళ్ల చుట్టూ చేరడంతో వైఎస్సార్ సీపీ నేత మన్యం శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కన్నయ్య జేసీబీ సాయంతో కాలువలు తీసి నీటిని కింది వైపునకు మళ్లించారు.

రాకపోకలు బంద్

మండలంలో కల్లూరు వంక ఉధృతంగా ప్రవహించడంతో అటువైపు రాకపోకలు నిలిచిపోయాయి. గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి కంచె ఏర్పాటు చేసి అక్కడ పహారా కాశారు. అత్తూరు కాలువ పొంగి ప్రవహించింది. కృష్ణాపురం లోలెవల్ కాజ్‌వేపై నీటి ప్రవాహం పెరగడంతో పోలీసులు అక్కడికి చేరుకుని రాక,పోకలను నిలిపివేశారు. జీపాళెం, నల్లపాళెం మార్గంలో స్వర్ణముఖి నదిలో నీటి ప్రవాహం పెరగడంతో రాక,పోకలు నిలిచిపోయాయి. వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీని రాళ్లకాల్వ వాగు చుట్టు ముట్టింది. రెండు పూరి గుడిసెలు కూలిపోయాయి. తహసీల్దార్ ఉదయ్‌సంతోష్, డీటీ భాను ఆ ప్రాంతాలకు వెళ్లి ఆయా వీఆర్‌వోలకు పలు ఆదేశాలిచ్చారు. ఆర్.మల్లవరం, కుమ్మరపల్లె, కృష్ణాపురంలో వరినాట్లు నీట మునిగాయి. పంట పొలాలు చెరువులను తలపించాయి. గుత్తివారిపల్లె, ఎస్‌యూపురం గ్రామాల్లో అరటితోటలు నేలకొరిగాయి.



గుత్తివారిపల్లెలో నేలకొరిగిన అరటి చెట్లు

లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తత అవసరం



జేసీబీతో కాలువ పూడికలను తీయిస్తున్న మున్సిపల్ కమిషనర్ అరుణ



బంగారుపాళెంలో కురుస్తున్న వర్షం

చిత్తూరు అర్బన్: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నగరంలోని లోతట్టు, నీవా నదీ పరీవాహక ప్రాంతాల్లో నగరపాలక అధికారులు, యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ అరుణ ఆదేశించారు. ఆదివారం ఉదయం కమిషనర్ నగరంలోని లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించారు. క్షేత్రస్థాయి పరిస్థితిని సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రధానంగా నీవా నదీ పరీవాహక ప్రాంతాలైన ఇరువారం, వీరభద్ర కాలనీ, ముత్యాలమ్మ గుడి, రిక్షా కాలనీ, వర్షపు నీటి ప్రవాహాలు అధికంగా ఉండే ఇందిరానగర్, బాబా కాలనీ, శంకరయ్య కుంట, కుమార్ నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదే సమయంలో డ్రైనేజీ బ్లాక్ అయ్యేందుకు అవకాశం ఉన్న ఎంఎస్ఆర్ సర్కిల్, కట్టమంచి మార్కెట్ యార్డు, కొండారెడ్డిపల్లె, ఓటీకేరోడ్ తదితర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించి నీరు నిల్వ చేరకుండా చూడాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పనులు చేయడానికి వీలుగా అత్యవసర బృందాలను నియమించారు. వీరు వారికి కేటాయించిన ప్రాంతాల్లో పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ లోకేష్, డీఈ రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, లోకనాథం, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

మండలంలో తుపాను ప్రభావం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగర, మండల ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం నుంచే తుపాను ప్రభావం కనిపించింది. నగర, మండల వ్యాప్తంగా వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలోనే అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు విధిగా విధుల్లో ఉండాలని ఆదేశించారు.

పంటలు జాగ్రత్త

తుపాను నేపథ్యంలో వ్యవసాయశాఖ అధికారులు సైతం అప్రమత్తం అయ్యారు. ఆర్బీకేలోని వ్యవసాయ శాఖ సహాయకుల ద్వారా రైతులను అప్రమత్తం చేస్తున్నారు. ముఖ్యంగా కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట సత్వరమే హార్వెస్టర్ ఉపయోగించి కోత మొదలుపెట్టేలా చూడాలని ఏడీ మధుసూదన్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. అలాగే ధాన్యాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించి వర్షానికి తడవకుండా చూసుకోవాలన్నారు. మిరప, ఇతరత్రా పంటల్లో వర్షపునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేయించాలని ఆయన సిబ్బందికి వివరించారు.

వర్షంతో జనం ఇక్కట్లు

బంగారుపాళెం: బంగాళాఖాతంలో తుపాను ప్రభావంతో ఆదివారం మండలంలో చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అప్పుడప్పుడు చిరు జల్లులతో కూడిన వర్షం పడుతుండడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, వివిధ వ్యాపారాలు సాగిస్తున్న చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. రబీ సీజన్‌లో వరి సాగు చేసే రైతులకు వర్షం అనుకూలంగా ఉంటుందని వ్యవసాయాధికారులు తెలిపారు.

ఉద్రిక్తత నడుమ ప్రహరీ గోడ నిర్మాణం



ప్రహరీ గోడ నిర్మాణానికి జేసీబీతో చదును చేస్తున్న పనులు

రామకుప్పం: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన భూమిలో ప్రహరీగోడ నిర్మాణ పనులు ఆదివారం ఉద్రిక్తతల మధ్య మొదలెట్టారు. స్కూలుకు పక్కనే ఉన్న రైతులు ఆక్షేపించారు. ప్రహరీ గోడ నిర్మాణానికి పూనుకున్న ప్రాంతంలో తమకు దారి కల్పించాలని వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడే ఉన్న ఎస్ఐ శివకుమార్, ఎంపీడీఓ రాధాకృష్ణ ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్య ఉన్నట్లయితే సంబంధిత రెవెన్యూ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణ పనులను అడ్డుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. దీంతో రైతులు వెనక్కు తగ్గారు.

పంటలను కాపాడుకోవాలి

గంగవరం: బంగాళాఖాతంలో వాయుగుండం తుపానుగా బలపడనున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి పంటలను కాపాడుకోవాలని పలమనేరు వ్యవసాయ సబ్‌డివిజన్ వ్యవసాయ సూచకులు అన్నపూర్ణాదేవి ఆదివారం ఒక ప్రకటనలో అప్రమత్తం చేశారు. పలమనేరు సబ్ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో ప్రస్తుతం 1,610 ఎకరాల్లో వరి, 225 ఎకరాల్లో రాగి పంట, 150 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు కోతకు సిద్ధంగా ఉన్నాయన్నారు. తుపాను ప్రభావంతో పంటలు నష్టపోకుండా ఆర్‌బీకే సిబ్బంది ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తూ, తుపాను ప్రభావం తగ్గే వరకూ సిబ్బంది అంతా గ్రామాల్లో పర్యటిస్తూ, రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే పంటల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని అధికారులకు చేరవేయాలని ఆదేశించారు.

ఓటర్ల జాబితా కార్యక్రమాన్ని పరిశీలించిన ఎంపీపీ



ఓటర్ల జాబితా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

రామకుప్పం: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. వలస వెళ్లిన, మృతి చెందిన వ్యక్తుల పేర్లను పోలింగ్ స్టేషన్ల వద్ద అధికారులు ఓటర్ల జాబితాలో తొలగించారు. కార్యక్రమాన్ని ఎంపీపీ సుబ్రమణ్యం పరిశీలించారు. వైఎస్సార్ సీపీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, బీఎల్ఓ, బీఎల్ఏలు పాల్గొన్నారు.

హామీ నెరవేర్చరూ!



మాట్లాడుతున్న దేవరాజులు రెడ్డి

పెద్దపంజాణి: సీపీఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నెరవేర్చాలని ఎస్టీయూ చిత్తూరు జిల్లా అధ్యక్షులు పి.దేవరాజులు రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండలంలోని శ్రీరామాపురంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించి దేవరాజులురెడ్డి మాట్లాడారు. సీపీఎస్ రద్దుచేసి పాత పింఛను విధానాన్ని అమలు చేస్తామని సీఎం హామీ ఇచ్చారన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ మాట్లాడుతూ, ఉద్యోగులు ప్రజాస్వామ్య పద్ధతిలో తమ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్నారన్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు. బోడెమోహన్ మాట్లాడుతూ, ప్రభుత్వం డీఎస్సీ నియామకాలకు పూనుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఎస్టీయూ అధ్యక్షులు బాబు రెడ్డి, నాయకులు మురళి, మూరెళ్ల భాస్కర్, జయరామప్ప, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో యువతను ప్రోత్సహించాలి



పైమాఘంలోని క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేస్తున్న సుగుణాకర్ రెడ్డి

తవణంపల్లె: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం..ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి స్ఫూర్తితో మండలంలోని పైమాఘం గ్రామానికి చెందిన క్రీడాకారులకు (యువకులకు) క్రికెట్ కిట్ అందజేసినట్లు దాత, అర్ధగిరి ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్, పారిశ్రామికవేత్త పైమాఘం సుగుణాకర్ రెడ్డి తెలిపారు. పైమాఘం ఏబీకే యూత్ క్రికెట్ అసోసియేషన్ క్రీడాకారుల జట్టుకు క్రికెట్ కిట్ కావాలని కోరడంతో రూ.20 వేల విలువ చేసే కిట్ అందజేసినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు ముందుకు వచ్చి తమ ప్రతిభను చాటి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఓటరుగా నమోదు చేసుకోండి





పూతలపట్టు: పోలింగ్ బూత్‌లో ఓటరు దరఖాస్తులను పరిశీలిస్తున్న ఈఆర్ఓ శివయ్య, యాదమరిలో..

చిత్తూరు అర్బన్: పోలింగ్ కేంద్రాల పరిధిలో యువతను కొత్త ఓటర్లుగా చేర్పించాలని ఏఈఆర్వో, కమిషనర్ అరుణ బీఎల్వోలను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్లు నమోదు అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం కమిషనర్ తనిఖీ చేశారు. ఇరువారం పరిధిలోని 111, 112 పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న స్పెషల్ సమ్మరీ రివిజన్ –2024 కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. ఫారం –7 విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అధికారి, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, బీఎల్వోలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తవణంపల్లె: మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం పూతలపట్టు నియోజకవర్గ ఎలక్ట్రోల్ ప్రత్యేక అధికారి శివయ్య పరిశీలించారు. మండలంలోని 56 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు నూతన ఓటర్ల నమోదు, మరణించిన, గ్రామం వదలిని, వివాహమైన ఓటర్లను తొలగించుట, సవరణల కోసం క్లైమ్లను ప్రత్యేక క్యాంపు నిర్వహించి స్వీకరించారు. మండలంలోని ఎగువ తడకర, జొన్నగురకల, అరగొండ, పైమాఘం పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు. పారదర్శకంగా ఓటర్ల నమోదు, ఓటర్ల తొలగింపు, సవరణలు చేపట్టాలని బీఎల్వోలను ఆదేశించారు. మండలంలో నూతన ఓటర్ల నమోదుకు ఫారం 6 క్లైమ్‌లు 98, మరణించిన వారి ఓటర్ల తొలగింపుకు 89 క్లైమ్‌లు, సవరణలకు(మార్పులు, చేర్పులు)64 క్లైమ్లు వచ్చినట్లు తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భూరీసర్వే డిటి వెంకటరమణ, సెక్టోరియల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటర్ల నమోదుకు నేడు ఆఖరు

యాదమరి: ప్రత్యేక శిబిరంలో ఓటర్లు నమోదుకు సోమవారం ఆఖరు రోజు అని తహసీల్దార్ హనుమంతు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల పాటు మండల పరిధిలో ఉన్న ఎన్నికల బూత్‌లోల బీఎల్ఓలు ఉన్నారని తెలిపారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యదర్శులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలి

బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తీవ్రవాయుగుండంతో మండల పరిధిలో మోస్తారు వర్షం కురుస్తున్నదన్నారు. తుపాన్ ప్రభావం మూడు రోజుల పాటు ఉంటుందన్నారు. దీనిపై మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, వలంటీర్లు అందరు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ హనుమంతు కోరారు.

ఓటరు నమోదు శిబిరాలకు విశేష స్పందన

పూతలపట్టు: మండలంలో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలోని ఓటరు జాబితాను ప్రజల పరిశీలన కోసం శని, ఆదివారాల్లో పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. యువకులు మార్పులు-చేర్పులు, బదిలీలపై పలువురు దరఖాస్తులను అందించారు. ఈ శిబిరంలో ఫారం–6లు 181, ఫారం –7లు 189, ఫారం–8లు 119 మొత్తం 489 దరఖాస్తులు అందాయి. మండలంలోని పోలింగ్ స్టేషన్లను ఈఆర్ఓ శివయ్య, మండల స్పెషల్ అధికారి జాన్‌విక్టర్, తహసీల్దార్ విజయభాస్కర్, ఈడీటీ మహేశ్వరి, ఆర్ఎస్‌డీటీ మునికృష్ణ పాల్గొన్నారు.